# విలువ ఎంత?

సాయంత్రం నాలుగున్నర అయింది. ఎర్రతంగేడు చెట్టునీడలో కూచుని జాజిపువ్వులు మాల కట్టుకుంటోంది లలిత. చుట్టూ చాలా ప్రశాంతంగా వుంది. నీరెండ తేలిగ్గా గడ్డిమీదకు జారుతోంది. శీతాకాలపు చల్లగాలి సన్నగా లలిత కురుల్ని తాకుతోంది.

ప్రిన్సిపాల్ రంగనాయకి మెట్లు దిగుతూ లలితవైపే వస్తోంది. లేచి నిల్చుందామా అని ఒకక్షణం ఆలోచించింది లలిత. కాని వడిలో పువ్వులు కిందపడిపోతాయని వూరుకుంది. చిరునవ్వుతో రంగనాయకికి కాంప్‌చైర్ చూపించింది కూచో మన్నట్టు.

"చేతిలో పూలమాలా, చుట్టూ ఆకుపచ్చని గడ్డి - సన్నని నీరెండా, ఇంత నిశ్శబ్దం - అన్నిటిమధ్యా నువ్వు ముని కన్యలా వున్నావు" అంటూ కుర్చీలో కూచుంది రంగనాయకి.

లలిత చిరునవ్వు నవ్వి వూరుకుంది. "సాయంత్రం ఎక్కడికేనా వెళుతున్నావా?" అని తిరిగా ప్రశ్నించింది రంగనాయకి.

"లేదు. మీరు అయిదింటికి రమ్మన్నారుగా-మధ్యాహ్నం అన్నమ్మ తెచ్చిందీ పూలు!"

"మధ్యాహ్నం నిద్దరపోలేదా?"

"నాకు పగటివేళ కళ్లు మూసుకున్నా నిద్దరరాదు. అందుచేత ఏదో పుస్తకం చేతబుచ్చుకు కూచుంటాను, లేదా చెట్ల స్కంధుల్లోంచి, రోడ్డుమీద చీమల్లాపాకే మనుషుల్ని చూస్తూ కూచుంటాను."

"గంటలకొద్దీ అలా ఏకాంతంగా నేను తల్లక్రిందులైనా గడపలేను. అన్నట్టు చెప్పడం మరిచాను, ఇందాక శేఖరం ఫోన్ చేశాడు, అయిదింటికి వస్తానని" అంటూ ఆగిపోయింది లలితవంకచూస్తూ. లలిత దూరదూరాల్లో చూస్తోంది. సమాధానంలేదు.

"అమాంతం అతన్ని కలుసుకోడం యిష్టం వుండక పోతుందేమోనని, నీకు ముందు చెబుదామని వచ్చాను. రావద్దని ఫోన్ చెయ్యమన్నావా ? బయట కెళ్తున్నానని చెయ్యమన్నావా ?"

"లలిత మాట్లాడలేదు. ప్రశ్నలన్నీ రంగనాయకివే!

"'లలిత వుందా హాస్టల్లో' అని అడిగాడు. వుందని చెప్పాను. నీకిష్టంలేకపోతే రావద్దని చెప్తాను ఏమంటావ్?"

లలిత గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. మళ్లీ శేఖరాన్ని చూడటమా! తను రావద్దని చెప్పడమేమిటి - రంగనాయకి తమ్ముణ్ణి. అతనొస్తే మటుకేం! రంగనాయకి పక్కనే వుంటుందిగా - తనూ శేఖరం వొంటిగా వుంటేనేగా పేచీ?

"దానికేం, రమ్మనండి" అంది లలిత కిందపడ్డ జాజి పువ్వుని తీస్తూ—

* * *

రంగనాయకి వెళ్ళిపోయింది. లలిత చేతిలో జాజి పువ్వులు – గుండెల్లో శేఖరం – ఎంత ఒంటరిగా కూచుంది!

ఆనర్సు అయ్యాక లలిత లెక్చరర్ పోస్టుకి అప్లయి చేసింది, నాలుగైదు స్త్రీల కాలేజీలకి. ఇంటర్వ్యూకొచ్చిన మొదటినాడే మొదటిచూపులోనే రంగనాయకి ఏదో ఆప్తురాలిగా స్ఫురించింది. ఇన్నాళ్ళకి తనకో స్నేహితురాలు దొరికినట్టు సంతోషించింది. క్రిందటి సంవత్సరం జూలైలో ప్రవేశించింది కాలేజీలో. మంచి రోజులు ప్రారంభం అయ్యాయి. డబ్బుకోసం తల్లిమీద ఆధారపడనక్కర్లేదు. రంగనాయకి ప్రిన్సిపాల్‌గా కాక ఫ్రెండుగా మారిపోయింది.

చదువుకునే రోజుల్లో వేసంగిలోతప్ప ఏ శెలవలకీ ఇంటికెళ్ళేదికాదు లలిత. ఆ వేసవి రెండునెలలూ ముళ్ళమీద వున్నట్లే వుండేది. తన తోటిపిల్లలు శెలవలకు నెల్లాళ్ళముందే యిళ్ళకువెళ్ళే వుత్సాహంతో వుండేవాళ్ళు. లలితకు మటుకు కాలేజీగానీ-స్కూలుగానీ వదలాలంటే దిగులుగా వుండేది. కాలేజీలో లెక్చరర్‌గా జేరింతర్వాతకూడా లలిత దసరాకి – సంక్రాంతికీ ఇంటికెళ్ళక ఒక్క వేసంగిలోనే ఇంటికెళ్ళింది.

క్రిందటి దసరా శెలవల్లో రంగనాయకితోపాటు లలిత మైసూర్ వెళ్ళి మూడురోజులుండి వచ్చింది. రంగనాయకికి తల్లిలేదు. తండ్రి తన గదిలో కూచుని ఏవో సంస్కృత గ్రంథాలు తిరగేస్తూండేవారు. రంగనాయకి అన్నలిద్దరూ ఏవో పెద్ద వుద్యోగాలు చేస్తున్నారట. తాము బయలుదేరే రోజు పొద్దుటమటుకు రంగనాయకి తమ్ముడు శేఖరంవచ్చి –

వాళ్ళని కార్లో బృందావనం తీసుకెళ్ళాడు. ఆ రాత్రి రయిలుకు బయలుదేరి వచ్చేశారు రంగనాయకీ - లలితా.

శేఖరాన్ని పరిచయం చేసింది మొదలూ - అతను వూపిరికూడా పీల్చుకోకుండా కబుర్లూ, కథలూ చెప్పేవాడు. లలిత స్వతహాగా మితభాషి. అక్కా, తమ్ముళ్ళ మధ్య చాలా చనువూ, ప్రేమా వున్నట్టు కనిపెట్టింది లలిత.

మొదటినుంచీ లలితకు ఎదుటివారిని గురించి తెలుసుకోవాలనే కోర్కె లేదు. ఎదుటివారు తననుగురించి యేమన్నా ప్రశ్నలువేస్తే తప్పించుకునేందుకు చాలా ప్రయత్నం చేసేది. స్నేహితులని చేసుకోవడం అంటే ఆమె జంకేది. స్నేహం చేసుకున్నా మనసివ్వక వారిని దూరదూరంగా వుంచేది. రంగనాయకికికూడా లలిత ఆంతర్యం పూర్తిగా తెలీదు.

క్రిస్టమస్ శలవల్లో రంగనాయకీ లలితా మద్రాసులోనే వుండిపోయారు. "మైసూరులో అంత పెద్దయింట్లో ఒక్క నాన్నతో గడిపేకంటే కాలేజీ హాస్టలేనయం" అంటూ రంగనాయకి ఉండిపోయింది. ఆ శలవల్లోనే శేఖరం అక్కగార్ని చూసేందుకు మద్రాసు వచ్చాడు.

శేఖరం రైలుదిగింది లగాయితూ- ఒకటే హడావుడి. రాత్రి ఏ కాసేపో హోటల్లో గడిపేవాడు. పగలంతా ముగ్గురూ రోడ్లమీదే వుండేవారు. ఎగ్జిబిషన్లు - పాటకచ్చేరీలు - నాటకాలు_సినిమాలు ఒకటేమిటి, వారంరోజుల్లో మద్రాసంతా తెగతిరిగేవారు. ఈలోపల లలితకు కూడా కాస్త అతనితో మాట్లాడేందుకు ధైర్యం - ఉత్సాహం కలిగాయి. వారం రోజులూ, కళ్ళుమూసి తెరిచేలోపల అయిపోయాయి వారికి

ఉత్తరాలకి జవాబు రాస్తానని లలిత దగ్గిరనుంచి మాట తీసుకుని మరీ రైలెక్కాడు శేఖరం. రైలు కదిలేటప్పుడు లలిత కళ్ళల్లోకి సూటిగా చూశాడు. తెలియకుండానే లలిత కంట్లో కన్నీరు తిరిగింది. ఛీ, వెధవ నలకలు. స్టేషనుకొస్తే కంట్లో నలకలు పడకుండా వుండవుగదా కొందరికి.

ఎంత మర్చిపోదామనుకున్నా శేఖరం నవ్వునీ, వొక్క-సారిగూడా ఆగకుండాపోయే అతని మాటల ప్రవాహాన్నీ లలిత మర్చిపోలేకపోయింది. రాత్రిళ్ళు ఆమెకు తెలియకుండానే దిండ్లు చెమర్చేవి.

శేఖరం దగ్గిరనుంచి కనీసం వారానికి వొకటన్నా ఉత్తరం వచ్చేది. లలితమీద తనకు వున్న మక్కువని దాచకుండా ఉత్తరాలురాస్తూండేవాడు. ఉత్తరాలుచదువుతూంటే లలిత హృదయం పొంగిపోయేది. జవాబులు మటుకు చాలా జాగ్రత్తగా - కాలేజీగురించి, రంగనాయకీ, తనూ చూసిన సినిమాలగురించీ రాసేది.

ఈ లోపల వేసంగి శలవులిచ్చారు. శేఖరానికి తను వూరుకెడుతున్నానని రాసింది గాని ఎడ్రసు రాయలేదు. కాని రంగనాయకికి మటుకు ఎడ్రసిచ్చింది. లలితకు తెలుసు శేఖరం అక్కగారివద్దనుంచి ఎడ్రసు తెప్పించుకు రాస్తాడని.

వాళ్ళ వూరు వెళ్ళిన మర్నాటి నుంచీ లలితకు రంగనాయకిమీద కాలేజీమీదా ఒక విధమయిన బెంగపట్టుకుంది. ఎప్పటిమాదిరిగానే లలిత ఆ యింట్లో యేదో పరాయిదానిగా ఫీలవుతోంది, ఒక్క తల్లిదగ్గర తప్పితే. తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ దగ్గిరకు పిలుద్దామని అనిపించినా మనసులో ఏదో

సిగ్గూ-ఏదో పరాయివాళ్ళనే బాధ కలిగి చాలా యెడంగా ప్రవర్తించేది. భోజనాలవేళ తప్పితే యింట్లోవాళ్ళకి కనబడేదే కాదు. శేఖరం ఉత్తరాలుచదువుకోడం, రంగనాయకీఅతనూ రాసే జాబుల కెదురుచూడటం-వాటికి జవాబు రాయడం అదే ఆమె జీవితం. మిగతాది నిస్తేజమైన కార్యక్రమం.

వాళ్ళవూరు వచ్చేక లలిత శేఖరానికిరాసే ఉత్తరాలు కొంచెం - పెద్దవిగానూ మార్దవంగానూ ఉండేవి. శేఖరం ఉత్తరాల్లో లలిత తల్లితండ్రులను గురించి వాకబుచేస్తూ రాసే వాడు. ఆ వాకబు చెయ్యడం గౌరవంకోసం. అందువిషయ మైన యీ సమాధానమూ అలాటివ్యర్థగౌరవంతో కూడినదే.

కాలేజీలు తెరిచారు. పంజరం వొదిలిన చిలకలా హాస్టల్లోకి వచ్చి వాలింది లలిత. రంగనాయకి పూర్వంకంటే చనువుగా, ప్రేమగా మాట్లాడేది. శేఖరం దగ్గిరనుంచి యథా ప్రకారం ఉత్తరాలు వచ్చేవి. లలిత రంగనాయకివద్ద శేఖ రాన్ని గురించిగానీ, రంగనాయకి లలితవద్దతనవాళ్ళనుగురించి గాని ఎత్తేవారుకాదు.

o o o o

మరుసటియేడు దసరాకి శేఖరం రెండురోజులు శలవు తీసుకుని మద్రాసు వచ్చాడు. మొదటిరోజు ముగ్గురూ చాలా సరదాగా గడిపారు. రెండోరోజు పొద్దుట శేఖరం రాగానే రంగనాయకి "నాకీరోజు ఆఫీసుపని చాలావుంది. అదీగాక తల నొప్పిగావుంది. మీ యిద్దరూ వెళ్ళిరండి" అంది.

రానని అనే అవకాశం యివ్వకుండానే "అల్లాగే - అసలు నేను లలితతో మాట్లాడుదామని అనుకున్నాను" అంటూ లలితను ప్రయాణం చేశాడు శేఖరం.

చీనాబజార్ - మూర్ మార్కెట్ అలా రోడ్లన్నీ తిరిగి ఇంటికి జేసుకునేముందు లలిత ఆ సాయంత్రంకూడా తనతో గడపాలని మాటతీసుకున్నాడు శేఖరం. ఆ సాయంత్రం ఇద్దరూ ఎన్నూర్ బీచిదగ్గిర కూచున్నారు. శేఖరం ఆనాడు చాలా సీరియస్‌గా ఉన్నాడు. ఎప్పటిలాగా అతని ముఖంలో అల్లరీ-నవ్వూ లేవు, గంభీరంగా వున్నాడు.

"ఈ పాటికి నీకు తెలిసేవుంటుంది నాకు నీమీదఎలాటి అభిప్రాయం వుందో. ఉత్తర్లాలో రాద్దామని అనుకున్నా. కాని నీ ఎదురుగా అడిగితే మంచిదని, శలవు దొరక్కపోయినా నానా యిబ్బందీపడి వచ్చాను..." అని ఆగిపోయాడు.

లలిత హృదయాకాశంలో అది ఉషాసమయం. జగమంతా పంచరంగుల్లో మెరుస్తోంది.

"నేనుసాంతం చెప్పేదాకా నువ్వేమీ మాట్లాడవద్దు. నా పరిస్థితీ, నా ఆస్థిపాస్తులు అన్నీ చెప్తాను. అప్పుడు నీకిష్టమైతే అవునందువుగాని" అంటున్నాడు.

చిలిపినవ్వుల శేఖరం వెనక ఎంత గంభీరత !

"నేను అక్కనడిగాను. అసలు మా గురించీ, మా సంసారం గురించీ నీకేమన్నా తెలుసునా అని. స్వతహాగా నువ్వేమీ ప్రశ్నలు వెయ్యవనీ అందువల్ల అక్క నీకు యేమీ చెప్పలేదనీ చెప్పింది."

"అవ్వన్నీ ఇప్పుడెందుకు?"

"ఏందుకుకాదు. నీ గురించి నాకు తెలుసుకోవాలని ఏమీ కుతూహలం లేదు. నువ్వు నువ్వుగా నాకు చాలును. మా సంసారం గురించీ నా గురించీ తెలియపర్చాల్సిన బాధ్యత నాకుంది. విను. మా నాన్న బెంగుళూరులో కమీషనరు చేసి రిటైర్ అయ్యారు. ముగ్గురు మొగవాళ్ళు, ఒక ఆడపిల్లాను. నాకు పదోయేట అమ్మ పోయింది. అందువల్లే అక్కకూ నాకూ చాలా చనువు. పెద్దన్నయ్య ఆర్మీలో కెప్టెను. ముస్లిమ్ అమ్మాయిని పెండ్లాడి నార్తిండియాలో సెటిల్ అయి పోయాడు. అతనికీ మాకూ అట్టే రాకపోకలు లేవు. రెండో అతను బొంబేలో సివిల్ సర్జన్ చేస్తున్నాడు. రెండో వదిన మైసూర్ ఆవిడ. ఇంక అక్క. ఆమె జీవితంలో ఒకనివల్ల దెబ్బ తింది. అందువల్ల పెండ్లి చేసుకోలేదు. మా నాన్నగారికి సాధార ణంగా అసలు యీ లోకంగొడవే వుండదు. ఆయన పుస్త కాలూ - ఆయనాను. ఎటొచ్చీ అక్కకు కాస్త చేదోడుగా వుండే పిల్లను చేసుకుంటే ఆయనకి తృప్తి. అల్లా అని నాకు నచ్చని పిల్లని చేసుకోమని నిర్బంధం చెయ్యరాయన. నిన్ను చూశారుగూడాను. అక్కకిష్టం - నాకిష్టం. యింకేంకావాలి? ఇంక నా సంగతి. నేను బెంగుళూరులోనే చదువుకున్నాను. పై చదువులకు పంపేందుకు నాన్న నన్ను వదిలి వుండలేక పోయారు. అందువల్లే విదేశాలకి వెళ్ళడం పడలేదు. మైసూ ర్‌లో నువ్వు చూసిన యిల్లూ, ఇరవై వేల యిన్స్యూరెన్సూ, ఆ రెండూ నాకూ అక్కకీ చెరిసగం వస్తాయి" అని ధారా

పాతంగా చెప్పుకుపోతున్నాడు శేఖరం. అసలు తనకివన్నీ ఎందుకు? అనవసరం?

— "ఆరేళ్ళక్రితం పోలీసు డిపార్టుమెంటులో చేరాను. రెండేళ్ళక్రితం సర్కిల్ అయ్యాను. రేపు డిశంబరులో పైరాంకు వచ్చేసూచనలున్నాయి. తొంభైతొమ్మిది పాళ్లు నేనే సెలకు అవాలి..."

కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి లలితకు. అన్ని మంచి గుణాలు కలిగిన శేఖరం పోలీసుకావాలా? అమ్మోపోలీసే...

"ఏమిటి అలా వణుకుతున్నావు. చలిగా వుందా! కోటు కప్పనా? పద. కార్లోకి వెళ్ళిపోదాం. నీవంట్లో బాగా లేదా?" అంటూ కారుదగ్గరకు తీసుకువెళ్లాడు లలితను.

ఆమె మోడలు కూలిపోయాయి.

"నే హాస్టలుకెళ్ళిపోవాలి. వెళ్ళాంపదండి" అంటూ సీట్లో కూలబడింది.

ఆ రాత్రంతా లలితకు ఒకటే జ్వరం. మర్నాడు వుదయం శేఖరం రైలు కెళ్ళేముందు వస్తే – ఏదో భయంగా మాట్లాడింది. అతనివంక కన్నెత్తి చూడలేకపోయింది.

ఆనాటినుంచీ శేఖరం రాసిన వుత్తరాలకి లలిత జవాబు వ్రాయలేదు. ఆఖరికి వుత్తరాలు విప్పటంకూడా మానేసింది. రంగనాయకి రెండుమూడుసార్లు ఆ విషయం తేబోయి లలిత ముఖంవంకచూచి టక్కున ఆగిపోయింది. ఆ తరువాత వాళ్ళ సంభాషణలో శేఖరం మాటగూడా రానిచ్చేవారు కాదు—

మళ్ళీ సాయంత్రం వస్తున్నాడట శేఖరం. తనప్రియుడు శేఖరంకాదు వచ్చేది-పోలీసు శేఖరం. అతన్ని ఎలా కలుసు కోడంకి

పోర్టికోలో కారు చప్పుడుతో తలెత్తిచూసింది. శేఖరం కారుదిగి సరాసరి అక్కగారి గదిలోకి వెళ్ళిపోయాడు.

లలిత పూర్తి చేసిన జాజిమాలను తీసుకు మెట్లెక్కింది.

♦ ♦ ♦

లలిత గదిలోకి అడుగుపెట్టింది. పడమటి వైపుగావున్న కిటికీలో కూచుని శేఖరం-అస్తమించే సూర్యుణ్ణి చూస్తు న్నాడు. గుమ్మంలో నుంచున్న లలితకు అతని కుడిచెంపమీద పుట్టుమచ్చ సూటిగా కనపడింది. శేఖరం దేన్నో తీక్షణంగా చూస్తున్నాడు. టేబుల్ మీద బంగవిల్లా పువ్వుల్లోని ఎరుపు దనం అతని ముఖంమీద ప్రతిబింబిస్తోంది. లలిత అడుగు ముందు వెయ్యలేకపోయింది.

శేఖరం వెనక్కితిరిగి లలితవంక చూశాడు. అతని కళ్ళనిచూస్తే లలితకు పుట్టెడుదుఃఖం వచ్చింది. అసలు నవ్వ డమే మర్చినట్లున్నాయి ఆకళ్ళు. ముఖం చాలామారిపోయింది. బుజాలు పూర్వంలాగా గాక ఏదో భారంమోస్తున్నట్టు వంగి వున్నాయి.

ఇద్దరూ నిశ్శబ్దంగా వొకరివంక మరొకరు చూచుకుంటు న్నారు. రంగనాయకి గదిలోకి అడుగెట్టింది. వెనక అన్నెమ్మ టీ-బిస్కట్లూ పట్టుకొచ్చింది. ముగ్గురి మధ్యా భరింపరాని నిశ్శబ్దం. ఒకరిచూపుల్ని ఒకరు తప్పించుకుంటున్నారు.

రంగనాయకి 'రెండునిముషాల్లో వస్తున్నా' అంటూ లోపలికి తప్పుకుంది.

శేఖరం రెండడుగులుముందుకు వేసి లలితచెయ్యిపట్టుకోబోయి, మళ్ళీ చటుక్కునఆగి "నాకు నీతో నాలుగుమాటలు మాట్లాడాలని వుంది. ఈ ఒక్క సాయంత్రం నాకు ఆ అవకాశం యివ్వవూ? ఈ వొక్కసారికే" అన్నాడు తల మరో వైపుతిప్పి. కన్నీటిచుక్కలు రాలాయా?

లలితకు ఏంచెప్పాలో తెలీటంలేదు. అతనిని కాకిబట్టల్లో తల్చుకుంటే వణుకోస్తోంది. ఎలాగూ శేఖరానికీ తనకీ పడదు. పోనీ యీ ఒక్క సాయంత్రం అతను చెప్పుకోదలచినది వింటే ఏం పోయింది? మళ్ళీ జ్వరం వస్తుంది. అంతేగా రానీ—

సరేనని లోపలికి వెళ్ళింది, జాజిమాలను రంగనాయకి సిగలో తురిమేందుకు.

○ ○ ○

మామిడిచెట్టు నీడలో కూచున్నారు శేఖరం లలితానూ. ఆరు అయింది. శేఖరం లలితను అదేపనిగా చూస్తున్నాడు.

"నేనంటే నీకిష్టంలేదా?" అన్నాడు శేఖరం. లలిత సమాధానం చెప్పలేదు.

"పోనీ యిష్టంలేకపోతేమానే, ఉత్తరాలకి జవాబు రాయని అపచారం ఏంచేశానూ? ఎన్నార్ వెళ్ళేదాకా బాగానే వున్నావుగా. నేనుచేసిన తప్పేమిటో నాకు తెలీడం లేదు. ఏమాటా చెప్పక, కారణం చెప్పక బాధపెట్టడం అట్టే

మంచిదికాదు. ఈమూడునెలల్లో నేను మానసికంగా చాలా కృంగిపోయాను. కబుర్లుచెప్పే నాకు హృదయం లేదనీ-ప్రేమ తెలీదనీ అనుకున్నావా ? జనవరిలో జరిగే ప్రమోషన్‌తో పాటు హైదారాబాదునుంచి ఈవూరుకు ట్రాన్స్‌పర్ కిఅంతా సిద్ధం చేసుకున్నాను. ఎందుకలా దిగాలుపడి కూచుంటావు. చెప్పు—మనసులోఉన్న దేదో?" రెండుచేతుల్లోముఖందాచు కున్నాడు. అతని బుజాలు వణుకుతున్నాయి.

నిస్సహాయంగా చూస్తోంది లలిత.

"మీా గురించి చెప్పారు. నా గురించి విన్నాక మీారు మీా యిష్టం వచ్చినట్లు అనండి."

శేఖరం ఆశగా లలిత కళ్ళల్లోకి చూశాడు.

o    o    o

మా అమ్మ చాలా అందగత్తె. కాని, బీదవాళ్ళవడం వల్ల గొప్పసంబంధాలు తేలేకపోయారు అమ్మా వాళ్లూ. పక్క జమీాందారి వూరులో, ఎస్టేటులో గుమాస్తా పని చేస్తున్న నాన్నకిచ్చి చేశారు అమ్మని. నాన్న మటుకు తగని వాడనికాదు. అమ్మ అందానికీ - అమ్మ తెలివికీ ముందునాన్న దిగదుడుపు అనడానికి సందేహంలేదు.

అయినా అమ్మా నాన్నా చాలా అన్యోన్యంగా వుండే వారు. అది జమీాందారీవూరు. వూరిలో ముప్పాతిక ఇళ్ళన్నీ ఎస్టేటు గుమాస్తాలవే. జమీాందారుగారికి ఇద్దరు కొడుకులు. పెద్దతను పట్నంలో చదువుతూండేవాడట. రెండోవాడు చిన్న పిల్లాడు.

ఒకనాడు అమ్మ పేరంటానికి వెళ్లోస్తోంటే, అప్పుడే

రైలు దిగొచ్చిన జమీందారుగారి పెద్దబ్బాయి అమ్మనిచూసి బొమ్మలా నిలబడిపోయాడట. అమ్మగూడా ఆయన్నిచూసి తొట్రుపడిందేమో ! అప్పటికి నాకు మూడోయేడు.

మరుసటి సంవత్సరం పెద్దబ్బాయిగారు చదువు పూర్తి చేసుకుని సొంతవూరు వచ్చి, జమీ చూసుకుంటూండేవాడు.

ఇలా కొన్నాళ్లు గడిచాయి. అప్పటికి నాకు అయిదేళ్ళనుకుంటాను. మానాన్న తరచు కాంపులకి వెళ్తూండేవారు. ఒకనాటి సాయంత్రం మంచి సూటులో ఎవరో అతను, మా నాన్నకంటె చక్కనివాడు సెంటువాసనతో మా యింటికొచ్చాడు.

నాకెందుకో ఆ మనిషిని చూస్తే ఇష్టంలేకపోయింది. అమ్మను కొట్టేందుకు వచ్చాడని భయమేసింది. అమ్మనివదలక ఎక్కిక్కి ఏడుపు మొదలుపెట్టాను. మొదట అతను పిప్పరమెంట్లూ - చాక్లెట్లూ యిచ్చి నన్ను మచ్చికచేసుకో చూశాడు. నాకెందుకో అవి తినబుద్ధి పుట్టలేదు. కొంతసేపటికి ఏడ్చేడ్చి నిద్దరపోయాను.

మూడోనాడు నాన్న వచ్చాడు. చెప్తే - నాన్న నవ్వి వూరుకోమన్నాడు. వారంరోజులుపోయాక నాన్న వూళ్లోలేని సమయాన ఆసూటాయన మళ్ళీవచ్చాడు. ఇలానాలుగయిదు సార్లు అమ్మకోసం ఆయన రావడంచూసి, నాన్నతో చెప్పగా నాన్న ఒకరోజున అమ్మని నిలవతీశాడు. అమ్మఏడ్చింది. నాన్న అమ్మను కొట్టాడు. అమ్మా నేనూ కలిసి మూడు రోజులు ఏడ్చాం. అప్పటినుంచీ నాన్న అమ్మనిరోజూకొడ్తూండేవాడు. నేనూ అమ్మా యిద్దరం ఏడుస్తూండేవాళ్ళం.

ఒకనాడు తెల్లారగట్ట అమ్మ చిన్న సంచీ చేతబుచ్చుకుని, నన్ను తీసుకుని వూరుబయట కెళ్ళి పెద్దబ్బాయిగారితో కలిసి పక్కపట్నం వెళ్ళిపోయింది. నాలుగు రోజులైనాకెందుకో చాలా దిగులుగా వుండేది. నాన్న జ్ఞాపకం వచ్చేవాడు. అమ్మ ఎంత ప్రేమగా వున్నాసరే అమ్మంటే కచ్చిగావుండేది. పెద్దబ్బాయిగారంటే గిట్టేదికాదు.

ఐదోనాడు, నాన్నా గడ్డం తాతా, అంటే పెద్దజమీందారు, ఇంకా నలుగురుమనుషులు మేమున్న చోటుకేవచ్చారు. నాన్న నన్ను కావిలించుకుని ఒకటే యేడుపు. అమ్మదగ్గిర కూడా నాన్న ఏడవటం మొదలుపెట్టాడు. అంతా చాలాసేపు ఏవేవో మాట్లాడుతూకూచున్నారు. చివరికి నేనూ అమ్మా-నాన్నా ఒక బండిలో తిరిగి మాయింటి కొచ్చేశాము.

కొన్నాళ్ళపాటు మళ్ళీ, అమ్మా నేనూ, నాన్నా బాగా వున్నాము. ఒకనాడు ఎందుకో నాన్న అమ్మకట్టుకున్న పట్టు చీరెనుచూసి-నాలుగు తిట్టి యింటిలోంచి వెళ్ళిపోయాడు. అమ్మ అలా ఏడుస్తూకూచుంది. నాన్నవచ్చేక అమ్మ ఇంకా ఆచీరె కట్టుకునివుండటం చూసి కొట్టాడు నాన్న. ఆ రాత్రి దెబ్బలు చాలా గట్టిగా కొట్టాడు. ఆ చీరె పట్నంలో అమ్మకి పెద్దబ్బాయిగారు కొనిచ్చిన చీరెట. ఆ చీరె కట్టుకుంటేనాన్నకి లోపలవున్న కోపం బయటకొచ్చిందట. వంటిమీద చెయ్యి వెయ్యనని పెద్దజమీందారుకి మాట యిచ్చి నాన్న యింటికి తీసుకొచ్చాడట అమ్మని. ఈ వివరాలన్నీ నేను పెద్దదాన్ని అయాక అమ్మ చెప్పగా తెలుసుకున్నాను.

ఆరాత్రి అమ్మకి జ్వరం వచ్చింది. రెండు రోజులు లేవలేదు. మూడో రోజు పొద్దుట, అమ్మ యింటిలో కనపడలేదు. నాకెందుకో యింక అమ్మ కనపడదనిభయంపట్టుకుంది. నాలుగు రోజులు అమ్మ కనపడలేదు. యింటిలో నేనూ-నాన్నా. నేను ఏడుపు. నాన్న అన్నం తినకుండా నన్ను మోసేవాడు.

ఐదో రోజు పొద్దుట-నాన్నే నాకు గౌను తొడిగిమిఠాయి పెట్టి ఎత్తుకుని బయటకి తీసుకెళ్లాడు. అది ఎర్రగావున్న ఇల్లు. లోపల యెంతో మంది పోలీసులు. చిన్నప్పుడు అమ్మ వాళ్ళని చూపించిబూచాళ్ళనిభయపెట్టేది. ఆ ఇంటినిండా ఎర్రటోపీల వాళ్ళే. భయంతో నాన్నని గట్టిగా పట్టుకున్నాను. దూరాన్నించి గుర్రపుసార్టులో- అమ్మ-పెద్దబ్బాయిగారు, గడ్డంతాత (అంటే పెద్దజమీందారు) రావడంచూసి అమ్మకోసం ఏడుపు మొదలెట్టాను.

నాన్న అమ్మని చూపించి, "అమ్మ చెడ్డది. నిన్ను బూచాళ్ళకి అప్పగిస్తుంది-అమ్మ పిల్చినావెళ్ళకు"అని చెవులో చెప్పారు పిప్పరమెంట్లు పెడ్తూను.

అమ్మా, జమీందార్లిద్దరూ బండిలోంచి దిగారు. మా చుట్టూ ఎర్రటోపీలు మూగాయి. నాకు ఒకటే భయంగా వుంది. నాన్న చెయ్యి గట్టిగా పట్టుకుని నిల్చున్నాను.

అమ్మ నన్నుచూసి చేతులు చాపింది. నేను వెళ్ళలేదు. అమ్మ అక్కడే కూచుని ఏడుపు మొదలెట్టింది. అమ్మనాన్ననీ, నాన్న అమ్మనీ తిట్టుకుంటున్నారు. చివరికి పెద్దబ్బాయిగారు నన్ను రమ్మనమని అడిగారు, అమ్మతో వుండేందుకు. రానని తల వూపాను.

ఎర్రటోపీ ఇన్‌స్పెక్టరు దగ్గరకొచ్చాడు. కొడ్తాడేమో నని భయంవేసింది. "అతనికిచ్చి, కొట్టించకపోతే వస్తానన్నా" అమ్మతో.

అమ్మ యివ్వనని దగ్గరకు పిల్చింది. నాన్న ఒక్కలాగు లాగారు.

అంతా గట్టిగా మాట్లాడారు. ఎర్రటోపీపోలీసు, నన్ను బలవంతంతో-నాన్న చేతులు రెండూలాగి-నన్ను లాక్కొని పోయాడు. తన్నుకుంటున్న నన్ను గుర్రంబండీలో కూచో పెట్టాడు పోలీసువాడు. ఆ రాత్రి నేను నాన్నకోసం చాలా ఏడ్చాను. వారంరోజులదాకా జ్వరంతగ్గి బయట పడలేక పోయాను.

తర్వాత అంటే పెద్దఅయాక విన్నాను; వాళ్లూ వీళ్లూ చెప్పుకునే మాటలబట్టి. అమ్మ మొదటిసారి వెళ్ళినపుడు కొట్ట నని మాటిచ్చి వెనక్కితీసుకొచ్చిన నాన్న, మాటతప్పటంచేత అమ్మపక్షం పెద్దజమీందారుకూడా వుండి తీసుకెళ్ళిపోయారు. అమ్మని వెనక్కి తీసుకురావాలనే కచ్చతో నాన్న "అమ్మ రెండువేలరూపాయల నగదుతో వెళ్ళిపోయిందని" పోలీసు కేసు పెట్టాడట.

జమీందారుగారూ - పెద్దబ్బాయిగారూ-అమ్మ కలిసి 'అమ్మను కొట్టి-పిల్లను వూడలాక్కొని యింటిలోంచి పొమ్మ న్నాడని' తిరిగి కేసు పెట్టారుట.

ఏనాడూ ఒక్క పట్టుచీరన్నా కొనలేని నాన్నదగ్గిర రెండువేల రూపాయల నగదు ఎత్తుకుపోవడం యేమిటి? అదీ గాక అవతలపక్షం వున్నవాళ్ళు గొప్పశ్రీమంతులాయను. నాన్న

పెట్టిన కేసు పోవడం కాకుండా నన్నుగూడా అమ్మకే యిచ్చేశారు. పై పెచ్చు నాన్న ఉద్యోగంకూడా వూడిపోయింది.

ఇలా ఏడాదిన్నర గడిచింది. నేనూ అమ్మా వూరు బైట పెద్దమేడలో వుండేవారం. ఇంటినిండా పనివాళ్ళు, తినేందుకు కావలసినన్ని చిరుతిళ్లు, యింటినిండా బొమ్మలు, సిల్కుగౌనులు; చాలా బాగా వుండేది. తోటనిండా పువ్వులు. మేడలోకి వచ్చాక నాకోసం ఒకమాస్టర్ని పెట్టారు, రోజూచదువుకుంటూండేదాన్ని.

అమ్మ మునుపటికంటే చాలా అందంగా సంతోషంగా వుండేది. నేనంటే ప్రాణంవిడిచేది. అమ్మ నన్ను ముద్దుచేసినప్పుడల్లా నాన్న జ్ఞాపకం వచ్చి పెద్దదిగులు కలిగేది నాకు. అమ్మను రెండు మూడుసార్లు నాన్నగురించి అడుగుతే, నాన్న మాట యెత్తవద్దనేది. రోజూ తోటలో అమ్మా నేనూ ఆడుకునేవాళ్ళం. అమ్మయెప్పుడూ బయటకెళ్ళేదికాదు. కాని పెద్దబ్బాయిగారుమటుకు యెప్పుడూ మాయింటిదగ్గిరే వుండేవారు. ఆయన ఎదుట వుండకుండా సాధ్యమైనంతవరకు తప్పించుకుని తిరిగేదాన్ని నేను. ఆయన నన్ను దగ్గిర తీసుకునేందుకుచాలా సార్లు ప్రయత్నించారు. ఒకసారి బలవంతాన యెత్తుకోబోతే చెయ్యి కరిచాను. అప్పటినుంచీ మళ్లా బలవంతాన ఎత్తుకోలేదాయన.

కొన్నాళ్ళు గడిచాయి. నేను యింగ్లీషుపేర్లు చదవడం మొదలెట్టాను. ఒక సాయంత్రం పెద్దబ్బాయిగారు వస్తూ, నాన్నని వెంటపెట్టుకుని వచ్చారు. నేను నాన్న వొళ్ళోఎక్కిదిగనేలేదు. నాన్న వెళ్తూ మర్నాడు తప్పక వస్తానని మాట

యిచ్చి, సిలండరు బొమ్మయిచ్చి వెళ్ళాడు. తెల్లవార్లూదాన్ని పక్కలో పెట్టుకుని నిద్దరపోయాను.

అంతకి రెండు నెలలక్రితం అమ్మ ఒక వారంరోజులు నలతగావుండి పక్కమీంచి లేవలేదు. డాక్టరు వచ్చివెళ్ళారు. తర్వాతగడ్డంజమీందారూ, అమ్మా నాలుగైదురోజులువేవో తమాషాగా మాట్లాడుకునేవారు. ఏడాదిన్నరకి అమ్మ ఏడవటం చూశాను.

"ఎందు కేడుస్తున్నావు ?" అని అడిగాను అమ్మని.

"అబ్బే ఏంలేదు. వూరికేనే. నీకు తమ్ముడుకావాలా చెల్లాయికావాలా ?" అని అడిగింది దగ్గరకుపిల్చి.

తమ్ముడే కావాలన్నాను. కొన్నాళ్ళలోనాకోతమ్ముడు పుడ్తాడని చెప్పింది. అవ్వాళంతా నేను చాలా సంతోషంగా వున్నాను. ఆతర్వాత నాన్నరోజూ రావడం మొదలెట్టారు. రోజూపొద్దుటపూట వచ్చివెళ్తూండేవాడు. కొన్నాళ్ళకి నాన్న యిక్కడే వుండిపోయాడు. కాని అమ్మ మటుకు ఏదో విచారంతో అప్పుడప్పుడూ ఏడుస్తూండేది.

ఒకనాడు అమ్మని మళ్ళీ అడిగాను యెందు కేడుస్తావని.

"పెద్దబ్బాయిగారికి పెళ్ళి" అంది అమ్మ.

"అయితే ?" అన్నాను నేను.

"ఇంక మనింటికిరారు" అంది అమ్మ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"మరీ మంచిది. నువ్వూ, నేను, నాన్న మన ముగ్గురం వుందాం హాయిగా" అన్నాను.

"మరి తమ్ముడో..."

"తమ్ముడూనూ—"

అమ్మ మాట్లాడలేదు.

పెద్దబ్బాయిగారు అమ్మమీద ప్రేమచేత పెళ్ళిచేసుకోడం మానేశారట. ఈ లోపల అమ్మ గర్భంతో వుందిట. "పెళ్ళిచేసుకోకపోతే అప్రదిష్ట, వంశం నిలబడదు" అని పెద్ద జమీందారు మొరబెట్టుకుంటే, అమ్మే బతిమలాడి పెండ్లికి ఒప్పించిందట. పెద్ద జమీందారు సలహాతో, నాన్నని మళ్ళీ యింట్లోకి రానిస్తున్నారట. ఏది ఎల్లాఅయినా పెద్దబ్బాయిగారు అమ్మను వదలనని పట్టుపట్టారట. పెళ్ళి చేసుకున్నా, అమ్మతో వుంటే యేం ఫరవాలేదని తండ్రి నచ్చజెప్పారట. ఈ మాటలన్నీ పెద్దబ్బాయిగారు పోయాక, నాకు లోకజ్ఞానం తెలిశాక అమ్మ నాకు చెప్పినవి.

మేము వూరుబయట మేడలోనే వుండేవారం. నాన్న గూడా బొద్దుగా తయారయాడు. పెద్దబ్బాయిగారి పెండ్లి చాలా వైభంగా జరిగింది. పెండ్లినాడంతా చాలా దిగులుగా వుంది అమ్మ. ఆరోజల్లా నేను అమ్మతోనే గడిపాను. నాన్న పెండ్లిచూసేందుకు వెళ్లారు.

మూడోనాటి సాయంత్రం పెద్దబ్బాయిగారు వచ్చారు. సావిట్లోవున్న నన్ను ఎప్పటిమాదిరిగాపలకరించకుండా అమ్మని చరచర మేడమీదకు తీసుకెళ్లారు. అమ్మచెయ్యి నెప్పిపుడుతుందేమోనని భయంవేసింది నాకు.

రోజూ పెద్దబ్బాయిగారు పూర్వంమాదిరిగా యిక్కడే గడిపేవారు. ఆయన వున్నటైమ్‌లోయింటిలోవుండేవాడుకాడు

నాన్న. వున్నా మేడమీద అడుగెట్టేవాడు కాదు. ఈ లోపల నాకో తమ్ముడు పుట్టాడు.

—ఆరు నెలలు గడిచాయి. నాకు ఎనిమిదేళ్ళనుకుంటా. అమ్మకు చాలా జబ్బు చేసింది. ఎప్పుడూ అమ్మపక్కమీదే కూచుని వుండేవారు పెద్దబ్బాయిగారు. నాకు అమ్మదగ్గిర కూచోవాలని చాలా వుండేది—అమ్మ రెండు మూడుసార్లు పిలిచింది. కాని పక్కన పెద్దబ్బాయిగారు వుండటంవల్ల దగ్గిరకెళ్ళ లేదు నేను.

తర్వాత అమ్మ పిలవడం మానేసింది. ఆనాడు అమ్మ పొద్దుటనుంచీ నావంక వొక్కసారికూడా చూడలేదు. ఆరు సార్లు వెళ్ళాను గదిలోకి, ఆరుసార్లూ కళ్ళుమూసుకునే వుంది. ఇంట్లో ఇద్దరు ముగ్గురు డాక్టర్లు. నాన్న గదిలో ఒక పక్కగా కూచున్నాడు. నాకెందుకో అమ్మపక్కన కూచోవాలనిపించింది. సాయంత్రం అయింది. దీపాలు పెట్టారు. అమ్మగదిలో సన్నని దీపం వెలుగుతోంది. నెమ్మదిగా కీసీడల్లోంచి నడుస్తూ అమ్మ పక్కదగ్గిరకెళ్ళాను. కాలుతగిలి మందుసీసా బోర్లపడింది పెద్దబ్బాయిగారు వులిక్కిపడి తలెత్తిచూశారు. నాన్న గుడ్లురుముతూ నావంకకొచ్చాడు. రెక్కపట్టుకు దొడ్లోకి తీసుకెళ్ళి, నాన్న ఎన్నిదెబ్బలు కొట్టాడో! తోటలో చివరనున్న పాకలోకి నెట్టి తలుపు జారేసాడు. నాకు నాన్నమీద పట్టరాని కోపంవచ్చింది. నాన్నంటే కోపం—పెద్దబ్బాయిగారంటే కోపం. అమ్మ నావంక చూడడంలేదు. ఇంక ఆ యింట్లో ఎందుకు? ఒక పక్కచీకటి. చీకటిలో గుబురుగుబురుగా వున్న చెట్లు దెయ్యాల్లా భూతాల్లా కనపడ్డాయి. ఒక్కపరుగున భయంతో రోడ్లుమీద

పడ్డాను. ఎంతదూరం పరుగెత్తానో నాకే తెలీదు. కాలికి రాయి తగిలి బోర్లాపడ్డాను. ఏడుస్తూన్న నన్ను మా చాకలి రామితాత ఎత్తుకున్నాడు. నాకు ఏడుపు ఆగిందికాదు. వాడి మెడ కావిలించుకుని భోరున ఏడ్చాను.

తాత తన గుడిశకు తీసుకెళ్ళి అన్నంపెట్టి తెల్లవార్లూ వులిక్కి-పడుతున్న నన్ను జోకొట్టుతూ నేవున్నాడు. తెల్లారి ఇంటికి తీసుకెళ్తానన్నాడు నన్ను. 'రానని' అన్నాను. నాన్న కొట్టాడని దెబ్బలు చూపించాను. వీపుమీద, బుగ్గలమీద వేళ్ళ అచ్చులు పడ్డాయి. మూడురోజులు చాకలి తాత గుడిశలో వున్నాను.

నాలుగోరోజు పొద్దున్నే నాన్నవచ్చాడు, నన్నుయింటికి తీసుకెళ్ళేందుకు. నేను రానన్నాను, తాతని కావిలించుకుని. తాత నాన్నని నాలుగూ తిట్టాడు. "చంటిపిల్లను అలాటి దెబ్బలు కొడ్తావయ్యా? నే పంపను పో-ఆ పిల్ల మాయింటో నే వుంటుంది" అన్నాడు, గుడిశలోకి నన్ను తీసుకెళ్తూ. ఆ వూర్లో మానాన్న అంటే ఎవ్వరికీ గౌరవం లేదు. ఇంతగొడవా జరిగాక తిరిగి, అమ్మ మెడలో వుంటున్న మనిషినిచూస్తే అందరికీ హేళనే.

మరోగంటకల్లా నాన్న పోలీసువాళ్ళతో తిరిగివచ్చాడు. నాకు భయంపట్టుకుందిపోలీసువాళ్ళని చూడగానే. తాత పంప నంటే పంపనన్నాడు. నేను వెళ్ళనన్నాను. పోలీసులు తాతని కొరడాతో రెండుదెబ్బలేశారు.అడ్డువెళ్ళబోయిన నన్ను రెక్క-పుచ్చుకునిలాగారు. గుంజుకుంటున్న నన్ను బరబరాలాక్కెళ్ళి బండిలో కూలేశారు. తాత ఆ దెబ్బలతో వారంరోజులు తీసు

కొని చచ్చిపోయాడట. వాళ్ళసంసారం గొడవ చెయ్యకుండా పెద్దజమీందారుగారు కల్పించుకుని కొండడబ్బూ అదీయిచ్చారట. ఆనాటినుంచీ రామి మా బట్ట లుతకడం మానేసింది. నాన్నని ఊళ్ళోవాళ్లు తలోమాటా అన్నారు. పెద్దబ్బాయిగారుకూడా చాలా కేకలేశారట. "నన్ను తాకవద్దు" అని అమ్మ నాన్నని శాసించిందట.

ఇంటికొచ్చాక ఆ రాత్రి నాకు జ్వరం. జ్వరంలో పోలీసులు-తాతని కొట్టడం, అదే పలవరింతలు, మూడోనాడు లేచాను. కాని పోలీసులంటే ఆనాటినుంచీ నాలో ఒక పెద్ద భయం పట్టుకుంది. పోలీసునిచూసినా, ఆమాట చెవినిబడ్డా నిలువెల్లా వణికిపోతాను. అమ్మ యింటికిరాగానే నన్ను కావిలించుకుని ఏడ్చింది. రోజూ డాక్టరు ఒక అరగంట అమ్మదగ్గిర నన్ను కూచోనిచ్చేవారు. ఆ టైములో పెద్దబ్బాయిగారుగాని, నాన్నగాని ఆ గదిలో వుండేవారుకాదు.

అమ్మ నన్ను చాలా ప్రేమగా చూసేది. పెద్దబ్బాయిగారు దగ్గిరకు పిలిచేందుకు ప్రయత్నించేవారుకారు. దూరాన్నించే నావంక విచారంగా చూసేవారు. నాన్నతో అసలు మాట్లాడేదాన్నికాదు. నాన్ననిచూస్తే భయంకంటే అసహ్యాం ఎక్కువయింది. ఆ యింట్లో నాకు సంబంధం వున్నదల్లా-అమ్మా తమ్ముడూనూ.

అమ్మ లేచి తిరుగుతూండేది. నేను చాలా దూరదూరంగా వుండేదాన్ని అమ్మతో. ఒకరోజుఅమ్మ నన్నడిగింది; "చదువుకునేందుకు మద్రాసు వెళ్తావా?" అని. గంతేశాను. అమ్మ విచారంగా చూసింది.

ఆ ఏడాది అమ్మ-పెద్దబ్బాయిగారూ తీసుకొచ్చి నన్ను అడయారు స్కూల్లో ప్రవేశపెట్టారు. స్కూల్లో అన్నిట్లో ఫస్టున వచ్చేదాన్ని కాని-ఎవరితో స్నేహం మటుకు చేసుకోలేదు.

మొదటి రెండుమూడేళ్లూ ప్రతి శెలవలకీ యింటికెళ్ళే దాన్ని. థర్డ్ ఫారమ్‌లోకి వచ్చాక చదువుకోవాలనే సాకుతో ఒక్క వేసంగికే యింటికెళ్ళేదాన్ని. ఇల్లు మామూలుగానే వుండేది. అమ్మా, నాన్నా, పెద్దబ్బాయిగారూ, ఇద్దరు తమ్ముళ్లూ-చెల్లెలూ.

పిల్లలంతా పెద్దబ్బాయిగారిని "బాబాయి బాబాయి" అని పిల్చేవారు. ఆయనదగ్గిర ముగ్గురు పిల్లలూ చాలా చనువుగా వుండేవారు. ఎప్పుడూ నెత్తిన ఎక్కించుకుని కూచునేవారు. నేను శలవల్లో యింటికెళ్ళినపుడు ప్రతిసారీ ఆయన చాలా వుత్సాహంగా నన్ను పల్కరించబోయేవారు. కాని నేను తుంచినట్లు సమాధానం యివ్వడంతో విచారంగాచూసి వూరుకునేవారు.

శలవల్లోయింటికెళ్ళినపుడు నాకుకావలసిన సామాన్లూ, బట్టలూ అన్నీ ఆయన ప్రత్యేకంగా, తనచేత్తో తెచ్చి యిచ్చేవారు. నాకు అవి పుచ్చుకోవాలంటే యిష్టంవుండేది కాదు. తప్పదు. ముభావనగా తీసుకునేదాన్ని.

చిన్నప్పటి ఆనాటి సంఘటనతో నాకూ నాన్నకీమధ్య సంబంధబాంధవ్యాలూ, ప్రేమాభిమానాలూ పూర్తిగా తెగిపోయినాయి. రాగానే ఏదో పల్కరించేదాన్ని-వెళ్ళేటప్పుడు వెళ్తున్నానని చెప్పేదాన్ని. ఎటొచ్చీ అమ్మా నేనూ మటుకు

చాలా స్నేహంగా, ప్రేమగా మసులుకుంటూండేవారం. నా చదువువిషయం పెద్దబ్బాయిగారితో మటుకు మాట్లాడుతూండేదాన్ని. నాన్నతో ఏనాడన్నా మాట్లాడుదామనిప్రయత్నించినా, చనిపోయిన రామయ్యతాతా, పోలీసులూ నాకుజ్ఞాపకం వచ్చేవారు. పోలీసుమాట అనగానే రామయ్యతాతా, దెబ్బలు, చిన్నప్పుడువాళ్ళు నన్ను నాన్నదగ్గరనుంచిగుంజుకోడాలు-జ్ఞాపకం వస్తాయి.

ఇలా రోజులు గడుస్తూండేవి. నేను స్కూలుఫైనలు పరీక్షరాసి యింటికొచ్చాను. ఒకనాడు సాయంత్రం తోటలో కూచుని ఏదో చదువుకుంటున్నాను. అమ్మ స్వెట్టరల్లుతూంది పక్కనున్న కుర్చీమీద కూచుని. పెద్దబ్బాయిగారు వచ్చారు. వెళ్ళిపోవాలనుకున్నాను. మోటుగావుంటుందని కూచున్నాను పుస్తకం మడిచి వొళ్ళో పెట్టుకుని.

"స్కూలుఫైనలు అయిందిగా-ఏం చదువుదామనిఅనుకుంటున్నావు ?" అన్నారు నావంక తిరిగి.

నేను సమాధానం చెప్పలేదు.

"నీకు మెడిసన్‌మీదా-లేకటీచింగ మీదా-దేనిమీద యిష్టంవుందో దాన్నిబట్టి యింటర్‌లో గ్రూప్ తీసుకోవలసివుంటుంది" అన్నా రాయన.

నేను సమాధానం చెప్పలేదు.

"ఇప్పటినుంచే కాలేజీలకు అప్లికేషన్లు పెట్టడంమంచిది. అందుకనే ఈవిషయం కదిపాను. ఏమంటావ్ ?" అన్నారు అమ్మవైపు తిరిగి.

"మొదటినుంచీ దానిచదువు మీరు చెప్పిస్తేనే జరుగుతోంది. దానికీ మీకూ ఏదియిష్టమో అదేచెయ్యండి. అసలు దానికి చదవాలనివుందో లేదో ?"

"ఏం ? ఎందుకుండదు ? హాయిగా చదువు కుంటుంది. కాదమ్మా లలితా" అన్నారు నా వంకతిరిగి.

నా కెందుకో ఆయన్ని చూస్తే జాలేసింది. పాపం ! నేనెంత అసహ్యించుకుంటున్నానో ఆయనకు తెలీదు. నాగురించీ యింకా పాకులాడుతూనే వుంటారు. తలవూపాను చదవాలని ఉందని.

అప్లికేషన్ ఫారాలన్నీ తెప్పించి, స్త్రీల కాలేజీ లన్నింటికీ అప్లయిచేశారు. Q M C. లో చేరాను. ఫస్టు గ్రూప్‌తో.

నే కాలేజీలో జేరిన ఆరునెలలకు పెద్దబ్బాయిగారికి ప్రాణంమీదకు వచ్చిందనీ, వెంటనే బయలుదేరి రమ్మనివైరిచ్చింది అమ్మ. వెళ్ళామా వద్దా అని తటపటాయించాను. కాని అన్నేళ్ళ సాంగత్యంవల్ల అనుకుంటాను, మనసు వెళ్ళమని తొందరజేసింది. ఆ రాత్రే బయలుదేరి వెళ్లాను. నే వెళ్ళే వేళకి చాలా జబ్బుగావుంది.

నే వెళ్ళగానే దగ్గిరకు రమ్మనమని సౌజ్ఞచేశారు. వెళ్ళి కుర్చీలో కూచోబోయాను. మంచంమీద కూచోమన్నారు. సంకోచంతో పక్కమీద కూచున్నాను. అందరినీ వెళ్ళిపొమ్మని సౌజ్ఞచేశారు.

నా చెయ్యి పట్టుకుని "నామీద ఇంకా నీకు కోపం పోలేదా ?" అన్నారు కళ్ళల్లోకి చూస్తూ.

నాకు నోటమ్మట మాట పెగిలిరాలేదు.

"నేను మీ అమ్మని ప్రేమించడం అంత క్షమించరాని తప్పా? మీ అమ్మకు పెండ్లి కాకుండావుంటే నేను ఆమెనే తప్పక పెండ్లాడి వుండేవాణ్ని. అంతకుపూర్వమే ఆమెకి పెండ్లి అవడం నా తప్పా - నువ్వుచెప్పు?" అన్నారు. ఆయన కళ్ళమ్మట నీరు జారింది.

నా కంట్లో నీరుతిరిగింది. నాకు తెలియకుండానే ఆయన కంటినీరు తుడిచాను. తేలికపడ్డహృదయం సాక్షాత్కరించింది ఆయన కళ్ళల్లో. "మీ అమ్మ అద్భుతమైన మనిషి. ఆమెను నువ్వూ నేనూ—అర్థంచేసుకున్నట్టు మరెవరూ అర్థం చేసుకోలేదు. నువ్వే జాగ్రత్తగా చూడాలి—" అన్నారు మళ్లీ.

నా కళ్ళమ్మట నీరు ఆగకుండా వస్తోంది. యీ మనిషి నేనా నేను యిన్నాళ్ళబట్టి అసహ్యించుకుంది!

"ఏది ఎలావున్నా చదువుమటుకు మానకు. నువ్వు డబ్బుకోసం ఆలోచించకు. మీ నాన్నమీదకూడా ఎక్కువ కోప్పడకు. పాపం! అతను మా ఇద్దరిమధ్యా నలిగిపోయాడు. నువ్వు బాగా చదువుకొని పెద్దదానివి అవాలి" ఆయన చేతిని నా చేతిలోకి తీసుకుని శూన్యంలోకి చూస్తూ కూచున్నాను. అన్నేళ్లూ అర్థంకానిది - నాలుగుమాటల్లో అర్థమయింది. ఆ మూడోరోజున ఆయన పోయారు.

ఆ తర్వాత నే నక్కడున్న నెల్లాళ్ళలో అమ్మ అనేక విషయాలు చెప్పింది. నాన్నతో సంధికి ఆయన ససేమిరా

వద్దన్నారట. ఆయన పెండ్లి చేసుకునేందుకు కూడా కారణమట.

చాలా రాత్రిళ్ళు ఆయన గురించి అమ్మ చెబ వుండేది. పన్నెండేళ్ళ వాళ్ల జీవితంలో ఏ ఒక్కనాడూ మాటకు ఆయన అడ్డుచెప్పలేదుట. "లలిత నన్నెంతగా స్తోందో - ఒకనాడు అంతగా ప్రేమిస్తుంది. ద్వేషించ తెలిసినవారే ప్రేమించగలరు" అనేవారట అమ్మతో. నా పిరికిగా ఆ యింట్లోకి రావడంకంటే-ఆయనచేత్తో యి పిప్పరమెంటుకూడా ముట్టని నా ఆత్మాభిమానం మెచ్చు వారట.

అమ్మకీ, పిల్లలూ వాళ్ళకీ సరిపడ్డంత ఆస్తిరాశారు. చదువు నిమిత్తం పదివేలూ, పెండ్లికి పదివేలూ నాకు చెం టట్లు బ్యాంకీలో వేశారుట. నాకాడబ్బు తీసుకునేందుకు మన రాలేదు. కాని అమ్మ చెప్పింది; "నువ్వు సుఖంగా వుం ఆయనకు ఆత్మశాంతి కలుగుతుంది. ఆయనమీద నీ గౌరవం ఏ మాత్రంవున్నా, ఆయన ఇచ్చినవి నిరాకరించకు అని.

ఆయన పోయాక అమ్మలో చాలా మార్పువచ్చింది నల్లటిజుట్టు నెరవడం మొదలెట్టింది. ఆ కళ్ళలోని కాంతి మాయమయింది. అమ్మ జీవితానందాన్ని పెద్దబ్బాయిగారు తనతో పట్టుకెళ్ళిపోయారు పరలోకానికి.

ఆయన పోయినాకకూడా మా నాన్నని క్షమించలేక పోయాను. నేను పెరుగుతున్నకొద్దీ నాన్నలోని బలహీనతా, పిరికితనం మరింత స్పష్టంగా కనిపించేవి.

వద్దన్నారట. ఆయన పెండ్లి చేసుకునేందుకు కూడా అమ్మే కారణమట.

చాలా రాత్రిళ్ళు ఆయన గురించి అమ్మ చెబుతూ వుండేది. పన్నెండేళ్ళ వాళ్ల జీవితంలో ఏ ఒక్కనాడూ అమ్మ మాటకు ఆయన అడ్డుచెప్ప లేదుట. "లలిత నన్నెంతగా ద్వేషిస్తోందో - ఒకనాడు అంతగా ప్రేమిస్తుంది. ద్వేషించడం తెలిసినవారే ప్రేమించగలరు" అనేవారట అమ్మతో. నాన్న పిరికిగా ఆ యింట్లోకి రావడంకంటే-ఆయన చేత్తో యిచ్చిన పిప్పరమెంటుకూడా ముట్టని నా ఆత్మాభిమానం మెచ్చుకునే వారట.

అమ్మకీ, పిల్లలూ వాళ్ళకీ సరిపడ్డంత ఆస్తిరాశారు. నా చదువు నిమిత్తం పదివేలూ, పెండ్లికి పదివేలూ నాకు చెందేటట్లు బ్యాంకీలో వేశారుట. నాకాడబ్బు తీసుకునేందుకు మనసు రాలేదు. కాని అమ్మ చెప్పింది; "నువ్వు సుఖంగా వుంటే ఆయనకు ఆత్మశాంతి కలుగుతుంది. ఆయనమీాద నీకు గౌరవం ఏ మాత్రంవున్నా, ఆయన ఇచ్చినవి నిరాకరించకు" అని.

ఆయన పోయాక అమ్మలో చాలా మార్పువచ్చింది. నల్లటిజుట్టు నెరవడం మొదలెట్టింది. ఆ కళ్ళలోని కాంతి మాయమయింది. అమ్మ జీవితానందాన్ని పెద్దబ్బాయిగారు తనతో పట్టుకెళ్ళిపోయారు పరలోకానికి.

ఆయన పోయినాకకూడా మా నాన్నని క్షమించలేక పోయాను. నేను పెరుగుతున్నకొద్దీ నాన్నలోని బలహీనతా, పిరికితనం మరింత స్పష్టంగా కనిపించేవి.

రామయ్య తాతని చంపిన లాఠీలను నేను మర్చిపో లేను. తాతచావు, పోలీసులు - యీ రెండూ నన్ను యీ నాటిదాకా వెన్నాడుతూనే ఉన్నాయి. చిన్నప్పుడు నాన్న చేతుల్లోంచి బలవంతంగా నన్ను లాక్కుపోయిన ఎర్రటోపీలు నాకు మరపురావు. 'నువ్వంటే - మీ వాళ్ళంటే నాకుచాలా యిష్టం. కానిపోలీసువుద్యోగిని మాత్రం నేను పెళ్ళిచేసుకోను. అంది లలిత చిరుచెమటలు తుడుచుకుంటూ.

"ప్రేమ విలువ ఎంత? సూర్యుడ స్తమించని బ్రిటిష్ సామ్రాజ్యమా? తాజ్ మహాలా? నీ కోసం ఈ ఉద్యోగం మానుకోలేనూ? ఏదో ఒక వుద్యోగం చెయ్యడం పురుష ధర్మం Come on ఇది కాకపోతే మరొకటి" అన్నాడు శేఖరం లలితని తనవైపు లాక్కుంటూ.

సూపర్నెంటవవలసిన శేఖరం - రాజీనామా పత్రం పంపాడని విని, మిగతా సర్కిల్స్ ముక్కుమీద వేలేసు కున్నారు.

——:o:——